## కులగణనపై గళమెత్తిన రాహుల్

హైదరాబాద్,కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు.. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడుసార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వమని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు. జన గణనతోనే కుల గణన చేయాలి అని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇక, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కుల గణన చేయాలని వీహెచ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేదంటే, ఎంపీల ఇంటి ముందు ధర్నా చేస్తాను అని హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే బీసీలకు న్యాయం చేసింది.. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను అందజేయాలని అన్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :100 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 19-06-2025 పేజీలు:4 వెల: 2.00


## దౌత్యవేత్తల పునర్ నియామకానికి భారత్-కెనడ మధ్య కుదిరిన అంగీకారం



కెనడా : నిజ్జర్ హత్యతో దెబ్బతిన్న భారత్-కెనడా (భారతదేశం - కెనడా) మధ్య సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. గత రెండేళ్లుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇటీవలే జరిగిన కెనడా ఎన్నికల్లో అధికార మార్పు జరగడం.. తాజాగా ప్రధాని మోదీ కెనడా పర్యటనతో మొత్తం మారిపోయింది. ట్రూడో పాలనలో తెగిపోయిన సంబంధాలు ఇప్పుడు మళ్లీ బలపడుతున్నాయి.రెండు దేశాల మధ్య పూర్తి దౌత్య సేవలను తిరిగి ప్రారంభించండి ఇరు దేశాలూ తాజాగా అంగీకారానికి వచ్చాయి. కెనడాలో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సుకు (G7 సమ్మిట్) హాజరయ్యేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ (మార్క్ కార్నీ)తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలు ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా దౌత్యవేతలను తిరిగి నియమించడంపై ఏకాభియం కుదిరింది. ఇరుదేశాల, వ్యాపారాలకు సాధారణ పౌరులను పునరుద్ధరించే లక్ష్యంతో కొత్త హై కమిషనర్లను నియమించడానికి అంగీకరించినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. ఈ సమావేశం ముఖ్యమైనదని అన్నారు.

## రంగంలోకి అమెరికా.. ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేసేందుకు ప్రణాళిక!

వాషింగ్టన్,ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం సాగుతోంది. ఇప్పటికే ఇరు పక్షాలు తీవ్ర స్థాయిలో దాడులు చేసుకుంటున్నాయి. ఆస్తి, ప్రాణ నష్టం భారీ స్థాయిలో జరుగుతోంది.అణు ఉత్పత్తిని నిలిపివేసేంత వరకు దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ హెచ్చరిస్తోంది. మరోవైపు తమతోనే అణు ఒప్పందం చేసుకోవాలంటూ అమెరికా అవకాశాలు ఇస్తోంది. కానీ అందుకు ఇరాన్ ససేమిరా అంటోంది. ఎవరితో ఎలాంటి ఒప్పందాలు చేసుకోమంటూ తేల్చి చెబుతోంది. దీంతో పరిణామాలు తీవ్ర ఉధృతం అవుతున్నాయి.తాజాగా ఈ యుద్ధంలోకి అగ్ర రాజ్యం అమెరికా కూడా దిగేందుకు సిద్ధపడుతోంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు చేసేందుకు వైట్‌హౌస్ ప్రణాళికలు రచిస్తోంది. కెనడాలో జరుగుతున్న జీ 7 శిఖరాగ్ర సమావేశం నుంచి అర్ధాంతరంగా ట్రంప్ వెళ్లిపోయారు. అనంతరం వైట్‌హౌస్‌లో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సిట్యుయేషన్ రూమ్‌లో ఉన్నత స్థాయి జాతీయ భద్రతా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగితే భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయని ఉన్నతాధికారులతో ట్రంప్ చర్చించినట్లు ఫాక్స్ న్యూస్ నివేదించింది. భవిష్యత్ వ్యూహాలపై ముఖ్య నేతలంతా మేథోమథనం చేసినట్లు తెలుస్తోంది.అయితే ఈ సమావేశంలో ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా దాడులు చేయాలని అమెరికా నిర్ణయం తీసుకున్నట్లు నివేదికలు అందుతున్నాయి. ఇరాన్ అణు మౌలిక సదుపాయాలను దెబ్బకొట్టాలని అమెరికా భావిస్తోంది. పర్వతం లోపల లోతుగా దాచబడిన ఫోర్డో ప్లాంట్‌ను ధ్వంసం చేసేందుకు వైట్‌హౌస్ కసరత్తు చేస్తోంది.ఇందుకోసం GBU-57 బంకర్ బస్టర్ బాంబును ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆక్సియోస్



నివేదించింది. B-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు ప్రత్యేకంగా పని చేయగలవని యూఎస్ సైన్యం భావిస్తోంది. GBU57 బంకర్ బస్టర్.. లోతుగా పాతిపెట్టబడిన లక్ష్యాలను నాశనం చేయగల సామర్థ్యం ఉంటుంది. 61 మీటర్ల వరకు భూగర్భంలోకి చొచ్చుకుపోగలదు. అనుకున్న లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం దీని సొంతం. ఇరాన్ అణు స్థావరాలు నాశనం చేయడం అమెరికా ఆయుధ సామగ్రికే సాధ్యమని ఇజ్రాయెల్ కూడా భావిస్తోంది. ప్రస్తుతం ఆ సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదు.ప్రస్తుతం అమెరికాకు చెందిన అత్యాధునిక బాంబర్లు హిందూ మహాసముద్రంలోని డియెగో గార్సియాలోని అమెరికా-బ్రిటిష్ సైనిక స్థావరంలో మోహరించి ఉన్నాయి. ఇరాన్ నుంచి దాదాపు 2,358 మైళ్ళు (3,796 కి.మీ) దూరంలో ఉన్నాయి. కార్యకలాపాలు నిర్వహించే పరిధిలోనే ఈ బాంబర్లు ఉన్నట్లుగా బీబీసీ తన నివేదికలో పేర్కొంది.

## గోల్కొండ బోనాలు వైభవంగా నిర్వహిస్తాం..

హైదరాబాద్: ఆషాఢమాసంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం కానున్న గోల్కొండ బోనాల ఉత్సవాలను ప్రభుత్వం తరుపున ఘనంగా నిర్వహిస్తామని రవాణా శాఖామంత్రి హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం గోల్కొండ పోర్టులో జరిగిన కార్యక్రమంలో బోనాలపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి తొలి బోనాల పండగ ప్రారంభమవుతుందని, ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ఉత్సవాలకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించారని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ దేవాలయాల అమ్మవార్లకు ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలను సమర్పిస్తామని మంత్రి తెలిపారు. నెలరోజుల పాటు జరిగే ఈ బోనాల ఉత్సవాల్లో గోల్కొండ కోటకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్నిశాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. మహిళా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు.వారికి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో నగర



మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ శ్రీలత, గోల్కొండ బోనాల ఆలయ కమిటీ ఛైర్మన్ చంటిబాబు, ఫిష్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, సౌత్‌వెస్టజోన్ డీసీపీ చంద్రమోహన్, తహసీల్దార్లు జ్యోతి, అహల్య, తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు కేటీఆర్ లీగల్ నోటీసులు



హైదరాబాద్:ఫోన్ ట్యాపింగ్ పేరిట పీసీసీ అధ్యక్షుడు చేసిన అసత్య ఆరోపణలపై బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ మహేష్ కుమార్ గౌడ్ కు లీగల్ నోటీసులుపంపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు తన చేతికానీతాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోందని దుయ్యబట్టారు.ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.చట్టాలను గౌరవించే వ్యక్తులుగా అక్రమంగా పెట్టిన కేసు విచారణకు సైతం హాజరై సహకరించామని తెలిపారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను పూర్తిగా గాలికొదిలేసి ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు. అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు తప్ప, ఈ లొట్టపీసు కేసుతో ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ అబద్ధాలు చెప్పడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెల్లదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం రాజకీయంగా పబ్బం కడుక్కునేందుకు చేసే ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల పైన మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కేటీఆర్ హెచ్చరించారు.ఇప్పటికైనా పరిపాలన పైన దృష్టి పెట్టి, అటెన్షన్ డ్రైవరేషన్ డ్రామాలను పక్కన ప్రతిపక్ష నాయకుల పైన ప్రాపగాండా చేయడం మానాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి చేసే అంశాల పైన దృష్టి సారించాలని హితవు పలికారు.

## హైపర్‌సోనిక్ మిస్సైళ్లతో విరుచుకుపడ్డ ఇరాన్..



టెహ్రాన్: ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం సాగుతోంది. ఇరాన్ సుప్రీం నేత అయాతొల్లా అలీ ఖమేనీ.. యుద్ధం మొదలైన'ట్లు ప్రకటించారు. ఇజ్రాయిలీల పట్ల దయ చూపాల్సిన అవసరం లేదన్నారు. హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణుల(హైపర్సోనిక్ మిస్సైల్)ను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటిం చింది. బుధవారం తెల్లవారుజామున క్షిప'ణులతో ఇజ్రాయిల్‌పై విరుచుకుపడింది ఇరాన్. రాత్రి సుమారు 12.40 నిమిషాల సమయంలో సుమారు 15 ప్రొజెక్టైల్స్ ఇజ్రాయిల్‌పై పడ్డాయి. మరో 40 నిమిషాల తర్వాత 10 రాకెట్లు కూడా ఇజ్రాయిల్ వైపు దూసుకెళ్లాయి. సెంట్రల్ ఇజ్రాయిల్‌తో పాటు వెస్ట్ బ్యాంక్ శరణార్థి కేంద్రాల్లో అర్ధరాత్రి అలర్ట్ జారీ చేశారు.మిస్సైళ్ల దాడి జరుగుతోందని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ తమ ప్రజలకు వార్నింగ్ ఇచ్చింది. సెంట్రల్ ఇజ్రాయిల్లోని ఓ పార్కింగ్ లాట్‌పై భారీ బాంబు దాడి జరిగింది. ఆ దాడిలో భారీ సంఖ్యలో కార్లు ధ్వంసం అయ్యాయి. హైపర్‌సోనిక్ మిస్సైళ్లను వాడినట్లు ఇస్లామిక్ రెవ'ల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రక'టించారు. ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్‌లో భాగంగా ఫతాహ్-1 మిస్సైళ్లను వాడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఆ దేశానికి చెందిన ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ఇరానీ దళాలు వైమానిక క్షేత్రాన్ని సంపూర్ణంగా ఆధీనం చేసుకున్నట్లు చెప్పింది.సోషల్ మీడియా అకౌంట్లలో ఫతాహ్-1 మిస్సైల్ దాడికి చెందిన విజువల్స్ వైరల్ అవుతున్నాయి. హైపర్‌సోనిక్ ఫతాహ్ మిస్సైల్ సుమారు 1400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను చిత్తు చేయగ'ల'దు. మాక్ 15 ధ్వని వేగంతో అది దూసుకెళుతుంది. అంటే ధ్వని వేగం కన్నా 15 రెట్లు అధిక స్పీడ్‌తో మిస్సైల్ ప్రయాణిస్తుంది. టెల్ అవివ్‌ను టార్గెట్ చేస్తూ.. హైపర్‌సోనిక్ మిస్సైళ్లను ఇరాన్ వదిలింది. కేవలం 4 నిమిషాల్లోనే ఆ మిస్సైల్ టార్గెట్‌ను చేరినట్లు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయిల్ మిస్సైల్ రక్షణ వ్యవస్థను ఫతాహ్ దాటి వెళ్లినట్లు.

## జగన్ కు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు?

అమరావతి,వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్.. ఇప్పటికే ఆస్తుల కేసుల్లో చిక్కుకుని అల్లాడుతున్నారు. మరోవైపు.. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం సహా.. ఇతర పలు అంశాలపై కూటమి ప్రభుత్వం ఉచ్చు బిగిస్తోంది. కీలక నిందితులుగా ఉన్న వారిని ఇప్పటికే అరెస్టు చేసి జైల్లో కూడా పెట్టారు. మరో కీలక వైసీపీ నాయకుడు, రాజంపేట ఎంపీ పెద్ద రెడ్డి మిథున్ రెడ్డిని కూడా నేడో రేపో అరెస్టు చేస్తారన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.ఇలాంటి సమయంలో అనూహ్యంగా జగన్ చుట్టూ ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసు చుట్టుకుంటోందని అంటు న్నారు పరిశీలకులు. తెలంగాణలో బీఆర్ ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం.. ఊపం దుకుంది. రేవంత్ రెడ్డి సర్కారు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ వేగాన్ని పెంచింది. తాజాగా కేసు విచారణలో కీలక సాక్షి.. గతంలో షర్మిల పోన్లు కూడా ట్యాప్ అయ్యాయని వివరించడం.. దీనిని అధికారులు రికార్డు చేయడం సంచలనంగా మారాయి.అయితే.. వైసీపీ హయాంలోనే ఇవన్నీ జరగడం గమనార్హం. వైసీపీ అధినేత జగన్‌ను ఢీ అంటే ఢీ అన్నట్టు గా అప్పట్లో ఎదిరించిన షర్మిల.. తర్వాత.. సొంత పార్టీ పెట్టుకున్నారు. అయితే.. దీనివెనుక ఓ పత్రిక య జమాని ఉన్నారన్న అనుమానంతో వైసీపీ నాయకులు నిఘా పెట్టారని సమాచారం. తనను దెబ్బ కొట్టేం దుకు షర్మిల ఎవరెవరితో మాట్లాడుతున్నారు? ఎవరెవరిని కలుస్తున్నారు? అనే విషయాలపై జగన్ కూపీ లాగడం



కోసం ఫోన్ ట్యాప్ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.దీనికి అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వ పెద్దలు కూడా సహకరించినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా వెలుగు చూసిన సమాచారం.. వైసీపీ అధినేత చుట్టూ ముసురుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఇదే జరిగితే.. జగన్‌కు తీవ్ర నష్టమని.. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇతర కేసుల కంటే తీవ్రమని పరిశీలకులు చెబుతున్నారు. పైగా సొంత చెల్లి ఫోన్‌నే ట్యాప్ చేయడం అంటే మరింత ఇబ్బందికర విషయమ ని.. రాజకీయంగా ఇప్పటికే జరిగిన నష్టానికి ఇది మరింత ఆజ్యం పోస్తుందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో..జగన్ ఎలా రియాక్ట్ అవుతారో.. చూడాలి.

## భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు : ట్రంప్‌తో మోదీ స్పష్టం

న్యూఢిల్లీ,పాకిస్థాన్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశామని ప్రధాని మోదీ తెలిపారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని స్పష్టం చేశారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు."జీ7 శిఖరాగ్ర సదస్సు (G7 Summit) అనుబంధంగా ప్రధాని మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ముందుగానే వెళ్లిపోవడంతో వీరు సమావేశం కాలేకపోయారు. అనంతరం వీరిద్దరూ 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి (Pahalgam Terror Attack) తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామన్నారు. ఆ తర్వాత నుంచి నుంచి వీరిద్దరూ మాట్లాడుకోవడం మళ్లీ ఇప్పుడే. కాబట్టి.. 'ఆపరేషన్ సిందూర్ ' వివరాలను ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి వివరించారు" అని మిస్రీ తెలిపారు."పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్-పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-



పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరిం చబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయం పై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉంది" అని మిస్రీ వివరించారు.ఇక కెనడా నుంచి తిరిగివెళ్తుండగా అమెరికా రావాలని ట్రంప్.. మోదీని ఆహ్వానించినట్లు మిస్రీ తెలిపారు. అయితే, ముందస్తు షెడ్యూల్ కారణంగా తాను రాలేనని భారత ప్రధాని వివరించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ద్వైపాక్షికంగా భేటీ కావాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. "భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు" అని మిస్రీ వెల్లడించారు.

## మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి!



మారేడుమిల్లి:అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని దేవిపట్నం మండలం కించకూరు-కాకవాడి గండి అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి.ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు గాజర్ల రవి అలియాస్ ఉదయ్ మృతి చెందినట్లు తెలుస్తోంది.మృతుల్లో మరో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. వీరిలో ఇటీవల మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి భార్య రావి వెంకట హరిచైతన్య అలియాస్ అరుణ ఉన్నట్టు సమాచారం. మరొకరి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అంజు ఉన్నట్లు గుర్తించారు. ఉదయ్‌ది వరంగల్ జిల్లాలోని వెలిశాల గ్రామం కాగా.. అరుణది అనకాపల్లి జిల్లా పెందుర్తి గ్రామం. ఘటనా స్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అగ్రనేత



## సంపాదకీయం

గురువారం 19-06-2025

# నేల ఎడారీకరణ అంచున సాగు భూములు!

నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది. భూక్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2025 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా భూమిని పునరుద్ధరించడం : అవకాశాల తిరిగి పొందడం అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరికొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి. ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీకరణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి. నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలియన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూ దిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి. మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.

# రగులుతున్న పశ్చిమాసియా... ప్రపంచంపై పెను ప్రభావం




టెహ్రాన్:ఇరాన్ ఇంతకాలం హమాస్, హెజ్బొల్లా వంటి ప్రాంతీయ శక్తులను ఇజ్రాయెల్ పైకి ఎగదోసేది. ఇప్పుడు ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్‌పై దాడికి దిగింది. రెండు దేశాలూ డ్రోన్లు, క్షిపణులతో దాడులు, ప్రతిదాడులు చేసుకుంటున్నాయి.ఇరాన్ ఇంతకాలం హమాస్, హెజ్బొల్లా వంటి ప్రాంతీయ శక్తులను ఇజ్రాయెల్ పైకి ఎగదోసేది. ఇప్పుడు ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్‌పై దాడికి దిగింది. రెండు దేశాలూ డ్రోన్లు, క్షిపణులతో దాడులు, ప్రతిదాడులు చేసుకుంటున్నాయి. ఇది పశ్చిమాసియాతోపాటు మిగతా ప్రపంచంపైనా తీవ్ర ప్రభావం చూపకమానదు.ఇరాన్–ఇజ్రాయెల్ వైరానికి 1979లోనే బీజం పడింది. ఆ ఏడాది ఇరాన్‌లో మతశక్తుల నాయకత్వంలో విప్లవం సంభవించింది. అయతుల్లా ఖొమైనీ సారథ్యంలోని ఇరాన్ మత పాలకులు ఇజ్రాయెల్‌ను జియోనిస్టు శత్రువుగా ప్రకటించారు. ఆ తర్వాత లెబనాన్‌లో హెజ్బొల్లా, గాజాలో హమాస్‌కు ఇరాన్ మద్దతునిచ్చి ఇజ్రాయెల్‌పై పోరుకు ఉసిగొల్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా, నాటో కూటమి పూర్తి మద్దతు ఇస్తూ వచ్చాయి. 2024 ఏప్రిల్‌లో సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబారి కార్యాలయంపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారులు హతమయ్యారు. ఇరాన్ అక్టోబరులో ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో ప్రతిదాడి చేసింది. తాజాగా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. ప్రతిగా ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్‌లోని నగరాలపై దాడి చేసినా, ప్రాణనష్టం తక్కువే. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్న ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లు గణనీయమైన నష్టాన్ని కలిగించినట్లు తెలుస్తోంది. మరోవైపు, అణ్వాయుధ నిరోధ ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి ఉపసంహరించుకునే దిశగా ఇరాన్ యోచిస్తోంది.

### పరిస్థితి ముదిరే అవకాశం

ఇరాన్–ఇజ్రాయెల్ పోరు ప్రభావం పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కాలేదు. మిగతా ప్రపంచంపై కూడా ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని కనబరుస్తోంది.ఇరాన్ తీరంలోని హొర్ముజ్ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు వాణిజ్యంలో అత్యధిక భాగం నడుస్తోంది. ఈ జలసంధి బందయితే చమురు నౌకల రాకపోకలు స్తంభించిపోయి ప్రపంచార్థికం దెబ్బతింటుంది. ముఖ్యంగా లెబనాన్, ఇరాక్, సిరియాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇజ్రాయెల్, ఇరాన్‌లకూ ఆర్థికంగా పెనునష్టం కలిగిస్తుంది. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ 2025లో మూడు శాతం వృద్ధిరేటు సాధిస్తుందని మొదట్లో అంచనా వేసినా, ప్రస్తుత పోరు ఆగకపోతే ఆ అంచనా తప్పిపోతుంది. ఇప్పటికే ఆంక్షలతో సతమతమవుతున్న ఇరాన్‌కు తాజా పరిణామాలతో చమురు ఎగుమతులు నిలిచిపోతే ద్రవ్యోల్బణం కట్టు తప్పుతుంది. అది రాజకీయ అస్థిరతకు దారితీయకమానదు. అమెరికా చొరవతో గతంలో కుదిరిన అబ్రహాం ఒప్పందాల అమలుకు యుద్ధ పరిస్థితులు అవరోధంగా మారనున్నాయి. తాజాగా అమెరికా–ఇరాన్‌ల మధ్య జరగాల్సిన అణు చర్చలు పట్టాలు తప్పాయి. చర్చల నుంచి వైదొలగుతామనీ, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)తో మాత్రమే సంబంధాలు కొనసాగిస్తామని ఇరాన్ హెచ్చరించింది. దారికి రాకపోతే ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వెంటనే అణు ఒప్పందం కుదుర్చుకోవడం మంచిదని హితవు పలికారు. ఇజ్రాయెల్ దాడులను విమర్శించిన రష్యా, చైనాలు ఇరాన్‌కు ఆయుధ, సాంకేతిక, దౌత్య సహాయాల్ని అందించి, ప్రత్యామ్నాయ సైనిక కూటములలో చేరాల్సిందిగా ప్రతిపాదించవచ్చు. ఇరాన్–ఇజ్రాయెల్ పోరులో ప్రధాన దేశాలు జోక్యం చేసుకోవడం వల్ల పరిస్థితి మరింత ముదరవచ్చు.

### భారతదేశానికి నష్టదాయకం

పశ్చిమాసియా నుంచి వచ్చే చమురు సరఫరాలపై భారత ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఈ దేశాల్లోని భారతీయ కార్మికులు, నిపుణులు జమచేసే విదేశ మారక ద్రవ్యం ఇండియాకు ఎంతో ప్రయోజనకరం. పశ్చిమాసియాతో భారత్‌కు సైనిక వ్యూహపరమైన ప్రయోజనాలూ ఉన్నాయి. అందువల్ల ఇరాన్–ఇజ్రాయెల్ పోరు దీర్ఘకాలం కొనసాగడం భారత్‌కు నష్టదాయకమే. చమురు సరఫరా స్తంభిస్తే ఇండియాలో ధరలు పెరిగిపోతాయి. రవాణా, పారిశ్రామికోత్పత్తి దెబ్బతింటాయి. ఎరువుల కొరతతో ఆహారోత్పత్తి తగ్గే ప్రమాదం ఉంది. ఇండియాకు ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతికపరంగా పొత్తు ఉంది. ఇరాన్‌లో చాబహార్ రేవును అభివృద్ధి చేయడం ద్వారా మధ్యాసియాతో రవాణా అనుసంధానం ఏర్పరచుకోవడానికి భారత్ కృషిచేస్తోంది. అందుకని ఇరాన్, ఇజ్రాయెల్‌లలో ఎటువైపూ మొగ్గలేని పరిస్థితి నెలకొంది. దౌత్యమార్గాల్లో పోరు విరమణకు ప్రయత్నాలు చేయడం మినహా మార్గాంతరం లేదు. పశ్చిమాసియాలో సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే, అక్కడున్న భారతీయ కార్మికులు, నిపుణుల భద్రత, వారు స్వదేశానికి పంపే మొత్తాలూ అనిశ్చితిలో పడతాయి.

### అంతర్జాతీయ సమీకరణాల్లో మార్పులు

ప్రస్తుతం నడుస్తున్న యుద్ధం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యే సాగుతుందా, ఇతర శక్తులూ జోక్యం చేసుకుంటాయా అన్నది త్వరలో తేలిపోతుంది. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్ బాగా బలహీనపడింది. కాబట్టి హమాస్, హెజ్బొల్లా, హూతీలను అది ఉసిగొల్పగలదా అనేది అనుమానమే. పశ్చిమాసియాలో ఇరాన్ మద్దతుతో నడిచే ప్రభుత్వాలు, సంస్థలు పడిపోతుంటే అమెరికా మద్దతు గల దేశాల బలం పెరుగుతోందని అమెరికన్ విశ్లేషకుడు ఎడ్ హుసేన్ వ్యాఖ్యానించారు. తాజా దాడులతో ఇరాన్ సైనిక పాటవాన్ని దెబ్బతీయడమే కాకుండా అక్కడి మత పాలకులపై తిరుగుబాటును ప్రేరేపించడమూ ఇజ్రాయెల్ వ్యూహంలో భాగమేనన్నది మరో అమెరికన్ నిపుణుడు స్టీవెన్ కుక్ అంచనా. ఇరాన్ నేరుగా అమెరికా స్థావరాలపై దాడి చేస్తే తప్ప, అగ్రరాజ్యం ప్రత్యక్షంగా సైనిక జోక్యం చేసుకోదని మరో అమెరికన్ ప్రతినిధి ఎలియట్ అబ్రామ్స్ చెబుతున్నారు. ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియాలో ఇరాన్ పలుకుబడి క్షీణిస్తుంది. ఫలితంగా ప్రాంతీయ, అంతర్జాతీయ సమీకరణలలో మార్పు రానుంది. పరస్పర అపనమ్మకాలు ముదిరిన నేపథ్యంలో అంతర్జాతీయ సంధి యత్నాలు ఏ మేరకు సఫలమవుతాయన్నది ప్రశ్న. భారతదేశానికి ఇరాన్, ఇజ్రాయెల్‌లు రెండింటితో సత్సంబంధాలు ఉన్నందువల్ల మధ్యవర్తిత్వం వహించగల స్థితిలో ఉంది. ఇలాంటి కృషి అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపజేయగలదు.

# అప్పులు...కేసులు...దబాయింపులు !

హైదరాబాద్,ఉమ్మడి ఎపి రాష్ట్రాన్ని విడదీసిన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరిందా అంటే లేదనే చెప్పాలి. ఉమ్మడి ఎపికన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం ఏర్పడ్డదే తమ అధికారం కోసం అన్నరీతిలో తెలంగాణలో దాదాపు పదేళ్ల పాటు టిఆర్‌ఎస్ లేదా బిఆర్‌ఎస్ రాజ్యమేలింది. ఐదేళ్లపాటు జగన్ కూడా ఎపిని సర్వనాశనం చేసి, అన్నింటా అవినీతిని జొప్పించారు. ఇలా దోపిడీ రాజ్యం నడిచింది. తెలుగు రాష్ట్రాల్లో దోపిడీని ప్రజలు పట్టించుకోకుండా పందేరాలకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్పను చేసింది. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేసింది. కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు గోదాట్లో పోసారు. ఇది పనికిరాని ప్రాజెక్ట్ అంటూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఇది వయబుల్ కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. గత బిఆర్‌ఎస్ పదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపెంకం,చేపల పెంకం, రైతుబంధు, ఈ కార్ రేసు వంటివన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇందులో పెట్టిన డబ్బులన్నీ స్వార్థానికి వాడుకున్నారు. కోట్లల్లో అవినీతి జరిగింది. దీనిపై విచారణ కూడా సీరియస్‌గా సాగడం లేదు. ఏడాదిన్నరయినా ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కూసూ తేలడం లేదు. ఇవన్నీ మరచిపోయి కెటిఆర్ సవాళ్లు విసురుతున్నారు. హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు. కవిత ఒంటికాలు మీద లేస్తున్నారు. మా నాయనకు నోటీసులు ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్ప ఇతరులు పాలనకు పనికిరారన్న రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి కేసులు పెడితే ధైర్యంగా ఎదుర్కోవాలి. నిజాయితీ నిరూపించుకోవాలి. కానీ నిగగ్గదీస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో



బీఆర్‌ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది. జగన్ కూడా ఎపిలో కూటమి విఫలం అయ్యిందని విమర్శలు మొదలు పెట్టారు. అప్పులు చేసి ఏం చేశారో చెబితే బాగుండేది. కానీ అలాకాకుండా అధికారం కోసం ఇప్పటి నుంచే తనవంతుగా ఎదురుదాడి యత్నాలకు శ్రీకారం చుట్టారు. రాజకీయ అవినీతిని విచారించేందుకు లోక్‌పాల్ లాంటి సంస్థలే శరణ్యం. ఈ దిశగా అడుగులు పడాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.

# జూబ్లీహిల్స్‌కు ఇప్పడే ఉపఎన్నిక ఉండకపోవచ్చు

హైదరాబాద్, హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఇప్పట్లో నోటిఫికేషన్ ఉండకపోవచ్చని, రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చని తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని గుర్తుచేశారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని అన్నారు. జూబ్లీహిల్స్‌లో డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నిక జరగాలని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్‌ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. వీరికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200కు కుదించిందని గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచిందని వెల్లడించారు సీఈఓ సుదర్శన్ రెడ్డి. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈనెల(జూన్) 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ఃఒం, ఃఒక్షలకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని చెప్పారు. నేషనల్ లెవెల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తోందని అన్నారు. రూరల్‌లో 87శాతం, అర్బన్‌లో 67శాతం ఓటర్, ఆధార్ కార్డ్ లింక్ జరిగిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అక్రమంగా అమ్ముతున్న డిఫెన్స్ మద్యం పట్టివేత

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో డిఫెన్స్ మద్యం పట్టుబడింది. మల్కాజిగిరిలో 37 బాటిళ్లు, మేడ్చల్ లో 24 బాటిళ్ల మద్యంను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ పర్సన్ ను అరెస్ట్ చేశారు. ఎక్స్ ఆర్మీకి చెందినటువంటి ఇద్దరూ వ్యక్తులు రెండు చోట్ల మద్యం అమ్మకాలు జరుపుతున్నారు అనే సమాచారం మేరకు మల్కాజిగిరి ఏఈఎస్ ముకుంద రెడ్డి బృందం రెండుచోట్ల దాడి చేసి 37 డిఫెన్స్ మద్యం బాటిల్లను సీజ్ చేశారు. పట్టుబడినటువంటి మద్యం బాటిళ్లు కర్ణాటక చెందినవిగా గుర్తించారు. డిఫెన్స్ క్యాంటీన్ లో నెలవారీగా వచ్చే కోటాను కొంతమంది వద్ద బాటిల్లను కొనుగోలు చేసి ఎక్స్ సర్వీస్ మెన్ పురుషోత్తం యాప్రాల్ లో, ముప్పరపు సిద్దయ్య ఆర్మీ పర్సనల్ కౌకూర్ లో అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నట్లు ఏ ఎస్ బి ముకుంద రెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 75 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్స్ పట్టుకున్న వారిలో ఏఈఎస్ ముకుంద రెడ్డితో పాటు సీఐ భరత భూషణ్ డిటిఎఫ్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డిలు సిబ్బంది ఉన్నారు. మద్యం బాటిల్ పట్టుకున్నటువంటి సిబ్బందిని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ అభినందించారు. మేడ్చల్ ఈఎస్ పరిధిలో హర్యానాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటువంటి లేబర్ వారు తీసుకొచ్చుకునేటువంటి మద్యం బాటిల్లను మేడ్చల్ సిఐ నవనీత ఏఈ ఎస్ మాధవయ్య డిటిఎఫ్ నర్సిరెడ్డిలు సిబ్బంది కలిసి వాహనాలు, బస్సులు నిలిపే ప్రాంతాల్లో తనిఖీలు చేసి 24 మద్యం బాటిల్లను సీజ్ చేసినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిల్లో విలువ రూ. 48 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్లను పట్టుకున్నటువంటి సిబ్బందిని సిఐని ఎక్సైజ్ సూపర్ రేటెండెంట్ ఎస్.కె ఫయాజుద్దీన్ అభినందించారు.

# తాటతీస్తానన్న పవన్ ఎక్కడున్నాడు

విశాఖపట్టణం, రాష్ట్రంలో మహిళలపై దారుణాలు జరుగుతుంటే తాట తీస్తా.. తోలు తీస్తానన్న పవన్ కల్యాణ్ ఏమయ్యారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్త ఓ మహిళను నడిరోడ్డుపై అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా రోడ్డుపై ఈడ్చుకెళ్లి.. చెట్టుకు తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురి చేశాడు. ఆ ఘటనపై వరుదు కల్యాణి మీడియాతో మాట్లాడారు. మహిళలు, బాలికలపై వరుస అఘాయిత్యాలు జరుగుతున్నాయి. విశాఖలో టీడీడీపీ కార్యకర్త మహిళను వివస్త్ర చేసి దాడి చేసినా పట్టించుకోలేదు.సత్యసాయి జిల్లాలో బాలికపై లైంగికదాడికి పాల్పడింది టీడీపీ వాళ్లే. నిందితులు అధికార టీడీపీకి చెందిన వాళ్లే కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రాష్ట్రంలో భయంకరమైన సంఘటనలు జరుగుతున్నాయి. మహిళలపై ఎవరైనా చేయివేస్తే తాట తీస్తానన్న పవన్ ఎక్కడున్నారు?మహిళల భద్రతను గాలికొదిలేశారు. హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారు?. రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఇచ్చిన ప్రాధాన్యత మహిళల భద్రతకు ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు.

# లై సైలంట్ మోడ్

అమరావతి,రాష్ట్రంలో పాతిక మంది వరకు జనసేన–భాజపా ప్రజా ప్రతినిధులు వున్నారు. వీరి నుంచి ఎంపికైన మంత్రులు వున్నారు. వీరి యాక్టివిటీ ఏమైనా నిత్యం పత్రికల్లో కనిపిస్తోంది. ఎమ్మెల్యే కావచ్చు, ఎంపీ కావచ్చు, మంత్రులు కావచ్చు. వీళ్ల నిత్య కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారాలు, లేదా అఫీషియల్ మీటింగ్ లు, ఇంకా ఇంకా ఏవైనా సరే పత్రికల్లో కనిపిస్తున్నాయా? తెలుగుదేశం ప్రజా ప్రజా ప్రతినిధుల వార్తలతో పోల్చుకుంటే అస్సలు జనసేన, భాజపా ప్రతినిధులు వున్నారా? అన్నదే అనుమానంగా కనిపించేలా వుంది వ్యవహారం.ప్రజా ప్రతినిధులు అన్నాక నిత్యం ఏదో ఒక వ్యవహారం వుంటూనే వుంటుంది. సమీక్షా సమావేశాలు వుంటాయి. లోకల్ పర్యటనలు వుంటాయి. అధికారులకు ఆదేశాలు వుంటాయి. ఇంకా చాలా వుంటాయి. అదే మంత్రులు అయితే ఫుల్ బిజీగా వుంటారు. మరి ఎందుకు వీరి వీరి వార్తలు ఎక్కడా ఒక్కటి కూడా కనిపించడం లేదు.డిప్యూటీ సిఎమ్ పవన్, కీలక మంత్రి మనోహర్ వార్తలు అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి. మిగిలిన వారి వార్తలు అస్సలు లేనే లేవు. మంత్రి సత్య కుమార్ ప్రభుత్వ పాలన ఆరంభంలో కాస్త కనిపించారు. ఇప్పుడు అస్సలు ఆయన వార్తలే కనిపించడం లేదు. పార్లమెంట్ సభ్యుడు సిఎమ్ రమేష్ అన్నిటా తానై కనిపించారు కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో. ఇప్పుడు అస్సలు ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదు. ఆయన లోకల్ గా వుండి వుండొచ్చు, ఢిల్లీలో వుండి వుండొచ్చు. కానీ పత్రికల్లో మాత్రం కనిపించడం లేదు. ఇక జనసేన, భాజపా ఎమ్మెల్యేల సంగతి అయితే చెప్పనక్కరలేదు. ఎవరో, ఎక్కడో వార్తలు కనిపించడం లేదు.ఒక్కసారిగా ఓ గ్రూపు ప్రజా ప్రతినిధుల వార్తలు అన్నీ ఒక్కసారిగా మీడియాలో కనిపించకుండా పోవడం ఏమిటి?

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

హైదరాబాద్, ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యమని అన్నారు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ . ఇది యుద్ధ సమయం కాదు.. చర్చలతోనే పరిష్కరించుకోవాలని మాస్కో సైప్రస్ లో అన్న మోదీ మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువలని ప్రశ్నించారు. ఇదేనా రామ రాజ్యం అంటే? ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలని అన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. హై సందర్భంగా మాట్లాడిన ఆయన చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..

# శత్రువ్వు ఎవరంటే?

అమరావతి,రాజకీయాల్లో ప్రత్యర్థులను గుర్తించడం సులువు. సొంత పార్టీలోని శత్రువుల్ని పసిగట్టడం కష్టం. ఒకవేళ ఫలానా వ్యక్తుల వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని గుర్తించేలోపే, జరగాల్సింది జరిగిపోయి వుంటుంది. అయితే వైసీపీలో విచిత్రమైన పరిస్థితిని చూడొచ్చు. సహజంగా అధినాయకుడికి దగ్గరగా ఉన్నోళ్లు, మరికొందరిని పార్టీ కోసం పని చేయడానికి ఆలోచిస్తుంటారు. వైసీపీలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. ఒకవైపు కూటమి పాలనపై వ్యతిరేకత వుందనే ప్రచారం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వైఎస్ జగన్ నాయకత్వంలో పని చేయడానికి ఇప్పటికీ సొంతపార్టీలోని కొందరు భయపడుతున్నారు. అలాగే క్షేత్రస్థాయి నుంచి ఇలాంటి భయాందోళనల్ని వైసీపీ శ్రేణుల్లో చూడొచ్చు. నాయకులుగా ఎదగడానికి ప్రతిపక్షం అనేది మంచి వేదిక అవుతుందని జగన్ తరచూ చెబుతున్నారు. ఆయన అన్నది నిజమే. ప్రతిపక్షంలో బాగా పని చేసేవాళ్లకు మంచి భవిష్యత్ వుంటుందని జగన్ హామీ ఇస్తున్నారు. ఇంత వరకూ బాగానే వుంది. కానీ ఆచరణలోనే ఎంత వరకు అమలవుతుందనే శంక వైసీపీ నాయకులు, కార్యకర్తల్ని వెంటాడుతోంది. జగన్‌ను సీఎంగా చూడాలనే తపనతో పదేళ్లు కష్టపడ్డామని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాతకనీసం పలకరించే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపు మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే , ఇంతకంటే భిన్నమైన పరిస్థితి ఏముంటుందనే ప్రశ్నకు, అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధిష్టానంపై వుంది. ప్రతిదీ చంద్రబాబు, లోకేశ్‌తో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పోల్చుకుంటున్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను టీడీపీ కార్యకర్తలు సులువుగా కలుసుకుంటున్నారు. కాకపోతే, ఒకరోజు అటూఇటూ కావచ్చు. ఇదే వైసీపీ కార్యకర్తలకు జగన్‌ను కలవడం అసాధ్యం. పైగా వైసీపీలో ఏకనాయకత్వం. టీడీపీతో పోల్చుకుంటే ప్రజాస్వామ్య లక్షణాలు చాలా తక్కువ. నియోజకవర్గ నాయకుడి కుటుంబం పదవులు, ఆదాయం పంచుకున్న తర్వాత, ఇంకా మిగిలి వుంటే గ్రామస్థాయిలో నాయకులకు, కార్యకర్తలకు సాయం చేస్తారు. ఎంతసేపూ తాము తప్ప, ఇతరులెవరూ అధిష్టానానికి దగ్గర కాకూడదని, అలాగే గుర్తింపు పొందకూడదనే మనస్తత్వం వైసీపీ నాయకులది. ఈ ధోరణే వైసీపీకి ప్రధాన శత్రువు. అందుకే టీడీపీని అన్ని కులాల వాళు తమ పార్టీగా భావించినట్టు, వైసీపీ వరకూ వచ్చేసరికి ఆలోచనలో పడుతుంటారు. అందరినీ కలుపుకునే పోయే మనస్తత్వం వైసీపీలో పెరిగే వరకూ, ఆ పార్టీ ఎదుగుదల అంతంత మాత్రమే. ఇప్పుడైనా కూటమి తనకు తానుగా తెచ్చుకున్న వ్యతిరేకత కారణంగా, వైసీపీలో జోష్ కనిపిస్తోంది. అంతే తప్ప, ఆ పార్టీ పెద్ద నాయకులు చేసిందేమీ లేదు. ఇప్పటికైనా వైసీపీ తన స్వభావాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం వుంది. ప్రజలతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని పోయే మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. చేజేతులా అభిమానుల్ని దూరం చేసుకునే మనస్తత్వాన్ని పోగొట్టుకోవాలి.

# ఒప్పుకుంటే తప్పా?




న్యూఢిల్లీ,"ఆపరేషన్ సిందూర్"లో మనం విజయం సాధించాం. అందులో సందేహం లేదు. కానీ ఏం పొందాం? ఏం పోగొట్టుకున్నాం? అనేది మాత్రం తెలియరావటం లేదు. జీవితమంటేనే కొంత గెలవడం, కొంత కోల్పోవడం అంటారు. అలాటిది యుద్ధమన్నాక ఎంతోకొంత నష్టం వుంటుందని ఎవరైనా ఊహిస్తారు. నష్టం ఎలా జరిగింది, ఎవర్ని బాధ్యులను చేయాలి, ఏ మెటీరియల్‌ని మార్చాలి అనేవి మిలటరీ అంతర్గత విషయాలు. పూర్తి సాంకేతిక విషయాలు. అవి బయటకు రానక్కరలేదు. కానీ స్థూలంగా యిన్ని విమానాలు పోయాయి, ఇన్ని ఓడలు దెబ్బ తిన్నాయి, యింతమంది పోయారు.. అనే అంకెలు విడుదల చేస్తాయి ప్రభుత్వాలు. ఇవి చెప్తూనే మనకు ఒనగూడిన లాభాలతో పోలిస్తే యివి పెద్ద లెక్క కాదు, శత్రువుకి యింకా ఎక్కువ నష్టాలు కలిగాయి అని చేరుస్తారు. మన ప్రభుత్వాలు అలాగే చేస్తూ వచ్చాయి. ఈసారి మాత్రం ప్రభుత్వం ఎందుకో కానీ గోప్యత పాటిస్తోంది. అవసరమా అనే సందేహం వస్తోంది. ఈ సందేహం మీకూ, నాకే కాదు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌కు కూడా కలిగినట్లుంది. అందుకని ఆయన మే 31న సింగపూరులో ఒక విదేశీ మీడియాకు యింటర్వ్యూ యిస్తూ తొలి దశలో "మే 7న మాకు నష్టాలు జరిగాయి. వెంటనే సవరించుకుని, శత్రువులపై విరుచుకు పడి విజయం సాధించాం." అన్నారు. అంతకు ముందు మే 11 సమావేశంలో ఎయిర్ మార్షల్ ఎకె భారతి, ప్రెస్ మీట్‌లో 'కంబాట్ సినారియోలో నష్టాలనేవి ఒక భాగం. అంతిమంగా విజయం సాధించారా లేదా అనే మీరడగాలి. ప్రస్తుతం యుద్ధం నడుస్తోంది కాబట్టి యింతకంటె వివరాలు అడగవద్దు." అంటూ చెప్పారు. యుద్ధం ముగిసిన 20 రోజులకు యీయన దాన్ని మరి కాస్త స్పష్టంగా నష్టాలు జరిగాయి అని చెప్పారు. అయితే ఎన్ని, ఏమిటి అనేది చెప్పటం లేదు. అది పెద్ద యింపార్టెంట్ కాదంటున్నారు. ఇక్కడ రఫేల్ విమానాలు కూలాయా, మరోటి కూలాయా అన్న సంగతి పక్కన పెట్టండి. వాటిని నడుపుతూ దేశసేవలో అమరులైన పైలట్లను మరణానంతర ఎవార్డులతో సత్కరించు కోవలసిన బాధ్యత మనపై వుంది కదా. (పైలట్లు అందరూ సురక్షితంగా తిరిగి వచ్చారంటున్నారు. ఇదెలా సాధ్యమో నాకు అర్థం కావటం లేదు) ఈ సమాచారం దాచేసి, వారి త్యాగాలను విస్మరిస్తే న్యాయం కాదు కదా! పాకిస్తాన్ వారు మన ఫైటర్ జెట్ విమానాలు ఆరిటిని (ఫ్రాన్స్ వారి రఫేల్ 3, రష్యా వారి మిగ్‌లు 2, మరొకటి) కూల్చి వేశామని చెప్పుకుంటూ వుంటే, దాన్ని ఖండిస్తూ ప్రభుత్వం తరఫు నుంచి ప్రకటన రాకుండా యీయన యిలా చెప్పడమేమిటి, అందునా విదేశీ గడ్డపై చెప్పడమేమిటి అనే విమర్శ వస్తోంది. ఒక మిలటరీ అధికారికి ఆ పాటి క్రమశిక్షణ వుండదా? ఒకవేళ ఆయన హద్దు మీరి వుంటే, ప్రభుత్వం చర్యలు తీసుకునేదిగా! లేక ప్రభుత్వమే ఆయన చేత యిలా చెప్పించిందా? ఇంతవరకే చెప్పించి, తర్వాతది చెప్పించక పోవడంలో ఆంతర్యమేమిటి? ప్రభుత్వం ఏదో దాచుదామని చూస్తోంది. ముఖ్యంగా కూలినవి రఫేల్‌వి అనే ఆరోపణ వస్తున్నపుడు ఔననో, కాదనో చెప్పాలి కదా. దసో కంపెనీ ప్రతినిధి, 'మావి కూలాయని అనడానికి లేదు. అనిల్ చౌహాన్ అలా అని వివరంగా చెప్పలేదుగా' అన్నాడు. 15 రోజుల క్రితం సిఎన్ఎన్‌లో ఒక ఫ్రెంచ్ యింటెలిజెన్స్ అధికారి ఒక రఫేల్ కూలిందని చెప్పాడని రాసింది. రాయిటర్స్ తమకు అమెరికన్ యింటెలిజెన్స్ అధికారులిద్దరు అదే చెప్పారని రాసింది. చైనా నుంచి పాక్ కొన్న జె - 35 విమానాలతో అది సాధించిందని మరి కొందరు రాశారు. వీటన్నిటితో జె -35 తయారు చేసే కంపెనీ స్టాక్స్ విలువ రెండు రోజుల్లో 40% పెరగ్గా, దసో స్టాక్స్ 10% తగ్గాయి. ఇప్పుడు దసో కంపెనీ భారతదేశం కన్‌ఫమ్ చేసేవరకు మావి కూలాయని ఒప్పుకోం అంటోంది. చౌహాన్ గారి అర్థోక్తిని ఎవరికి కావలసినట్లు వాళ్లు వాడుకుంటున్నారు! అనిల్ చౌహాన్ నిర్వహిస్తున్న పదవి చాలా బాధ్యతాయుతమైనది. మోదీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం సృష్టించిన పదవి అది. మిలటరీ కమాండ్స్ యివ్వకపోయినా త్రిదళాధిపతుల కంటె పైన వుండే పోస్టు. అనిల్ ఆ పోస్టులోకి 2022 సెప్టెంబరులో వచ్చారు. ఆర్మీలో వుండగా పరమ విశిష్ట సేవా మెడల్, ఉత్తమ్ యుధ్ సేవా మెడల్ వంటి అనేక సత్కారాలు పొంది 2021 అక్టోబరులో రిటైరై 2022 సెప్టెంబరు వరకు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కి మిలటరీ ఎడ్వయిజర్‌గా పని చేశారు. ఇలాటి ప్రధాన వ్యక్తి పాక్ వాళ్లు చెప్పేది అబద్ధం అంటాడు తప్ప నిజమేమిటో చెప్పడు. ఎన్ని కూలిపోయాయన్నది ముఖ్యం కాదు, ఎందుకు కూలాయన్నది కీలకం అన్నాడు. ఎందుకు కూలాయన్నది ప్రజలకు చెప్పడం అనవసరం. చెప్పినా వాళ్లకు అర్థం కాదు. ఇప్పుడు ఎయిర్ ఇండియా విమానం ఎందుకు కూలిందో చెప్తున్న సాంకేతిక విషయాలు మనకు ఎంతవరకు వంటబడతాయి? ఎన్ని యుద్ధవిమానాలు కూలాయన్నది మాత్రం ముఖ్యమే. ఫుట్‌బాల్ మ్యాచ్ గెలిచాం అంటే మీరెన్ని గోల్స్ తేడాతో కొట్టారు? అని అడక్కుండా వుంటారా? అవతలివాళ్లను ఎంత తక్కువ కొట్టనిస్తే అంత గొప్ప కదా! అంతర్జాతీయ మీడియా ప్రకారం ఇండియా 3 రఫేల్, 1 సుఖోయ్, 1 మిగ్ కోల్పోయింది. కాంగ్రెసు పాలిట బోఫోర్స్ ఎలాగో, బిజెపి పాలిట రఫేల్ అలా తయారైంది. అందుకని అవి కూలిపోయాయని ఒప్పుకోవడం తమకు మచ్చ తెస్తుందని భయపడి బిజెపి ప్రభుత్వం వాస్తవాలు చెప్పటం లేదా? అన్న సందేహం కలుగుతోంది. దాన్ని సత్వరంగా నివారించ వలసిన బాధ్యత కేంద్రానిదే! ప్రజల విశ్వాసమే పాలకులకు బలం. గోప్యత పాటించిన కొద్దీ సందేహాలు మరింత పెరుగుతాయి. ఇక్కడ రఫేల్ కూలిందా, మిగ్ కూలిందా అన్నది నా దృష్టిలో పెద్ద విషయం కాదు. ప్రతిష్ఠాత్మక బోయింగ్ విమానం సైతం అహ్మదాబాద్‌లో కూలింది. ఇక్కడ మనం ఉలిక్కిపడవలసినది పాక్-చైనా సైనిక బంధం గురించి. మన యుద్ధ విమానాలు %-% ఎన్నయితే అన్ని %-% కూల్చినవి చైనా విమానాలు. గత 40 ఏళ్లగా స్వయంగా ఏ వైమానిక యుద్ధమూ చేయని చైనా యింత శక్తివంతమైన యుద్ధవిమానాలు చేయగలిగిందన్నది, వాటిని పాక్‌కు అమ్మిందన్నది మనం గుర్తించాలి. పాక్ డిఫెన్స్-అఫెన్స్ వ్యూహంలో చైనీస్ జె-10, చైనీస్ మిస్సయిళు (పిఎల్ 15) పాల్గొన్నాయి. పైలట్లు పాక్ వారే, విమానాలు చైనావి. 'సైనిక వ్యూహాలు కూడా చైనా వారివే, చైనీస్ సైనిక ఉపగ్రహాలు, చైనీస్ ఏఐ పాటవం కూడా ఉపయోగించారు. ఒకలా చెప్పాలంటే చైనా తన ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను పరీక్షించుకోవడానికి ఈ ఇండో-పాక్ యుద్ధాన్ని వినియోగించుకుంది.' అని మాజీ కేంద్ర మంత్రి చిదంబరం ఒక వ్యాసంలో రాశారు. పాక్‌పై చైనాకి ఎందుకింత ప్రేమ? అనే దానికి నాకు సమాధానం 270525 నాటి "హిందూ"లో దొరికింది. దాని ప్రకారం ఆపరేషన్ సిందూర్‌లో భారత్ స్వదేశీ ఆయుధాలతో పాటు ఇజ్రాయేల్ (స్కైస్ట్రయిక్ డ్రోన్), రష్యా (పెచోరా, ఒఎస్ఏ-ఎకె మిస్సయిళ్లు) వాడింది. పాక్ చైనా వారి పిఎల్-15 మిస్సయిళ్లు, టర్కీ వారి ఏరియల్ వెహికిల్స్ వాడింది. ఇండియా తన ఆయుధాలలో 33% యుఎస్ఎస్ఆర్ నుంచి దిగుమతి చేసుకునేది. 1990లు వచ్చేసరికి అది 96.5% కు చేరింది. సోవియట్ రష్యా విచ్ఛిన్నమయ్యాక అది క్రమేపీ తగ్గి 2020ల నాటికి 75% కు చేరింది. రష్యాకు బదులుగా ఇండియా ఫ్రాన్స్ (9%), యుకె (5.5%), ఇజ్రాయేల్ (5%) అమెరికా (3%) ల నుంచి కొనుగోలు చేయసాగింది. ఇక పాకిస్తాన్ విషయానికి వస్తే, అది దశాబ్దాలుగా అమెరికా, చైనాల నుంచి కొనుగోలు చేస్తూ వచ్చింది కానీ యిటీవల అమెరికా దిగుమతి తగ్గించేసి చైనాది పెంచేస్తూ వచ్చింది. 2000ల్లో చైనాది 19% వుంటే, 2010ల్లో 41%కు, 2020ల నాటికి 95% పెరిగింది. అమెరికా వాటా 1950ల్లో 80% వుండేది, 1980ల నాటికి 60% అయింది. 2000ల్లో 67% వుంటే, 2010ల్లో 38% కు, 2020ల్లో 0.9% కు తగ్గిపోయింది. ఆయుధాల విషయమే కాదు, చైనాకు పాక్‌తో వున్న 'ఋణానుబంధం' కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పాక్ ఒక్కటే కాదు, ఆసియా దేశాలన్నిటినీ చైనా తన ఋణవలయంలో ఎలా బిగిస్తోందో వేరే ఆర్టికల్‌లో రాస్తాను. ఆపరేషన్ సిందూర్ వివాదం యుద్ధ విమానాల చుట్టూ తిరుగుతోంది కాబట్టి ఆయుధాల్లో

# పౌరసత్వ రుజువు చూపినప్పటికీ నలుగురు భారతీయులను బంగ్లాదేశ్‌కు పంపించిన బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ: భారత పౌరులు అయినప్పటికీ పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురిని భారత అధికారులు బంగ్లాదేశ్‌కు పంపారు. వారిని పశ్చిమ బెంగాల్ పోలీసులు సోమవారం(జూన్ 16)స్వదేశానికి తిరిగి తీసుకువచ్చారు. వీరిలో ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు శాశ్వత నివాసితులు, మరొకరు బర్ధమాన్ నివాసి ఉన్నారు. అక్రమ బంగ్లాదేశీయులు అనే అనుమానంతో ఈ వ్యక్తులను మహారాష్ట్ర పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత వారిని సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్)కు అప్పగించారు. వారిని సరిహద్దు దాటించి బంగ్లాదేశ్‌కు పంపారు. సోమవారం ఈ విషయం మీద స్పందిస్తూ ముర్షిదాబాద్ పోలీసులు మాట్లాడారు. నలుగురు వ్యక్తుల భారతీయ పౌరసత్వాన్ని నిర్ధారించడానికి స్థానికంగా దర్యాప్తు నిర్వహించామని పోలీసులు తెలియజేశారు. ధ్రువీకరణ తర్వాత, సంబంధిత పత్రాలు, పౌరసత్వ రుజువును బీఎస్ఎఫ్‌కు అప్పగించామని చెప్పుకొచ్చారు. "బీజీబీ(బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్)తో బీఎస్ఎఫ్ వెంటనే ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించింది. చివరకు బంగ్లాదేశ్ నుంచి నలుగురిని అధికారులు భారతదేశానికి తీసుకువచ్చారు. కొన్ని గంటల క్రితం భారత సరిహద్దులోని కూచ్‌బిహార్ పోలీసులకు అప్పగించారు. వారిని తిరిగి తీసుకురావడానికి ముర్షిదాబాద్ జిల్లా పోలీసుల బృందాన్ని పంపారు. రేపటి నాటికి నలుగురు వ్యక్తులు సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తారు" అని ముర్షిదాబాద్ పోలీసులు పేర్కొన్నారు. తిరిగి తీసుకువచ్చిన నలుగురిని మెహబూబ్ షేక్, నజీముద్దీన్ మండల్, మినారుల్ షేక్, ముస్తఫా కమల్ షేక్‌గా గుర్తించారు. దీనికంటే ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం, నలుగురిలో ఒకరైన 36 ఏళ్ల మెహబూబ్ షేక్ పౌరసత్వ రుజువును వలస సంక్షేమ బోర్డు ఇంకా పశ్చిమ బెంగాల్ పోలీసులు సమర్పించారు. అయినప్పటికీ, మహారాష్ట్ర పోలీసులు అతన్ని అప్పగించిన తర్వాత బీఎస్ఎఫ్ అతన్ని బంగ్లాదేశ్‌కు పంపించింది. షేక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముర్షిదాబాద్ జిల్లాలోని భాగబంగోలాలోని మహిసస్థలి గ్రామ పంచాయతీ ప్రాంతంలోని హుస్సేన్ నగర్ గ్రామంలో నివసిస్తున్నారు.

'వారు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా ఇష్టపడలేదు'

పశ్చిమ బెంగాల్ వలస సంక్షేమ బోర్డు చైర్మన్ సమీరుల్ ఇస్లాం మాట్లాడుతూ, "షేక్ కుటుంబం మమ్మల్ని సంప్రదించింది. ఆ తర్వాత మేము మహారాష్ట్ర పోలీసులను సంప్రదించాము. అవసరమైన అన్ని పత్రాలను వారికి పంపాము. వారు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా ఇష్టపడలేదు. షేక్‌ను బీఎస్ఎఫ్ బంగ్లాదేశ్‌కు పంపించారు" అని అన్నారు. షేక్ సోదరుడు ముజిబుర్ వార్తాపత్రికతో మాట్లాడుతూ, అతను గత రెండు సంవత్సరాలుగా



మహారాష్ట్రలో పనిచేస్తున్నాడని చెప్పాడు. ముజిబుర్ మాట్లాడుతూ, తను టీ తాగుతుండగా, పోలీసులు బంగ్లాదేశీయుడనే అనుమానంతో తనను పట్టుకుని కనకియా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని అన్నాడు. షేక్ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తరతరాలుగా పంచాయతీ ధృవీకరించిన అతని కుటుంబ వంశావళితో సహా అన్ని పత్రాలను మహారాష్ట్ర పోలీసులకు పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం(జూన్ 14) షేక్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. తెల్లవారుజామున 3.30 గంటలకు బీఎస్ఎఫ్ తనను బంగ్లాదేశ్‌కు పంపిందని తెలియజేశాడు. "శనివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో తనను బీఎస్ఎఫ్ బంగ్లాదేశ్‌కు పంపించిందని అతను చెప్పాడు. అతను ఫోన్ చేసిన గ్రామంలో ఆశ్రయం పొందాడు. అతను ఏడుస్తున్నాడు" అని అతని సోదరుడు ముజిబుర్ చెప్పాడు.

తమను తాము సమర్థించుకున్న మహారాష్ట్ర పోలీసులు..

తమ చర్యను సమర్థించుకుంటూ షేక్ తన జాతీయతను నిరూపించుకోవడానికి పత్రాలను సమర్పించడంలో "విఫలమయ్యారని" మహారాష్ట్ర పోలీసులు అన్నారు. దీంతోపాటు, పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అతను ఆధార్, పాన్ కార్డులపై ఆధారపడలేదని తెలియజేశారు. గమనించాల్సిన విషయం ఏంటంటే, పహల్గాం ఉగ్రవాదదాడి తర్వాత భారతదేశ 'పుష్ బ్యాక్' వ్యూహంలో భాగంగా వందలాది మంది అనుమానిత అక్రమ వలసదారులను తూర్పు సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్‌కు పంపించారు. దేశవ్యాప్తంగా పోలీసులు అక్రమ వలసదారులను గుర్తించడానికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, దీనికంటే ముందు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ మే 8న భారతదేశానికి ఒక లేఖ పంపింది. అందులో తమ దేశంలోకి ప్రజలను ఈ విధంగా నెట్టడంపై ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, భారత ప్రభుత్వం డిపోర్టేషన్ విధానాలను అనుసరించడంపై మండిపడింది.

# ఇండిగో విమానానికి బాంబ్ బెదరింపు

ముంబై,విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులు ఇటీవలే కాలంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గతవారం అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం అనంతరం ఇలాంటి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. తాజాగా కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి దేశ రాజధాని ఢిల్లీ వెళ్తున్న ఓ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఇ 2706 విమానం మస్కట్ నుంచి కొచ్చి మీదుగా ఢిల్లీ వెళ్తోంది. అయితే, విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని నాగ్‌పూర్‌ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ ప్రయాణికులందరినీ కిందకు దింపి.. తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదని నాగ్‌పూర్ డీసీపీ లోహిత్ మతాని తెలిపారు.

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల

అమరావతి, గోదావరి వరదల వల్ల ఎపికే ఎక్కువ నష్టం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసమే కేంద్రానికి లేఖ రాశాం అని అన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోతున్న ఎపికి.. నీళ్లు ఉపయోగించుకునే హక్కుఉందని చెప్పారు. గోదావరి నీళ్లు నిరుపయోగంగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎగువ నీటి అవసరాలు తీరిన తర్వాతే బనకచర్లకు నీళ్లు వృథాగా పోతున్నాయని ఆ నీళ్లనే బనకచర్లకు వాడుకుంటాం అని తెలియజేశారు. రాజకీయ లబ్ది కోసమే బనకచర్లపై వైసిపి విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదని అన్నారు. బనకచర్లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టుపై అనుమానాలు అవసరం లేదు అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆయన సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని ఆయన వివరించారు. 'ప్రపంచంలోనే ఒక నదిలో ఒకే సమయంలో 50 లక్షల క్యూసెక్కులు ప్రవహించే నది గోదావరి. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే ఉపయోగించుకుంటాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మాత్రమే బనకచర్లకు తరలిస్తాం. ఎక్కడా నికర జలాలను వాడట్లేదని స్పష్టంగా చెబుతున్నాం. ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళ్లుగా గోదావరి నీరు వృథాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీ అని విమర్శలు చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించు కోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సార్‌ఎస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి వివేక్

హైదరాబాద్,జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్‌కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు.

# ఆ కులం ఆత్మ గౌరవాన్ని కాపాడిన పవన్ కల్యాణ్!



అమరావతి,ఆత్మ గౌరవం.. అనేది సామాజిక భద్రతలో ఒక కీలక అంశం. దీనిని అందరూ కోరుకుంటారు. కేవలం డబ్బుతోనే కాదు.. సామాజికంగా కులం ఆధారంగా కూడా.. ఆత్మ గౌరవం లభిస్తుంది. గతంలో కూడా ఓ సామాజిక వర్గం తమ కులానికి సంబంధించి ఆందోళన చేసింది. కసాయి అనే పదాన్నితొలగించాలని ఉద్యమించింది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఈ పదాన్ని రికార్డుల నుంచి తొలగించింది. అలానే తాజాగా దాసరి సామాజికవర్గానికి చెందిన వారు తమ ఆత్మ గౌరవంపై ఉద్యమించారు.తమ కులానికి చెందిన వారిలో ఎక్కువ మంది యాచక వృత్తిలో ఉన్నారని.. దీంతో తమ కులం మొత్తానికి కూడా దీనిని ఆపాదిస్తున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. యాచక వృత్తిలో ఉన్నంత మాత్రాన అందరినీ ఇదే గాటన కట్టడం సరికాదని వారు పేర్కొన్నారు. దీనిపై గత ఎన్నికలకు ముందే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వినతులు సమర్పించారు. అయితే.. పాలన ఏడాది పూర్తయినా.. ఇప్పటి వరకు దీనిపై మార్పు రాలేదు. దీంతో కొన్నాళ్ల కిందట మరోసారివారు పవన్ ను కలిసి తమ విన్నపాన్ని గుర్తుచేశారు.దీంతో దాసరి సామాజిక వర్గం వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని.. వారి కులానికి పక్కన అధికారికంగా ఉన్న యాచక వృత్తిదారులు అనే పదాన్ని తొలగించాలని సర్కారుకు పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఇదివారి ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం తాజాగా దాసరి కులాల వారికి ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రంలో ఇక నుంచి యాచకులు అనే పదాన్ని తొలగిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, దాసరి కులస్తులు.. బీసీ-ఏగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

# ఎయిరిండియాకు 4 వేల కోట్ల బీమా పరిహారం..

సెంట్రల్ డెస్క్:గత గురువారం భారత విమానయాన రంగంలో అతి పెద్ద విషాదం... టేకాఫ్ అయిన నిమిషాల్లోనే విమానం కూలిపోవడం.. 270 మంది చనిపోవడం.. ఇదంతా మన దేశంలోనే జరిగిందా? అని ఇంకా కలగానే అనిపిస్తోంది.. ఒక్కో ప్రయాణికుడు.. ఒక్కో కల. ఇలా ఎందరి ఆశలతోనో అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం నిట్టనిలువునా కూలింది.. అంతేకాదు.. ఎందరికో ప్రాణాలు పోయాల్సిన యువ వైద్యుల ప్రాణాలు తీసింది. చనిపోయినవారి కుటుంబాలకు ఎయిరిండియా నిర్వాహక సంస్థ రూ.కోటి పరిహారం ప్రకటించింది. గాయపడినవారి కుటుంబాలకూ పరిహారం ఇస్తామని తెలిపింది.ఇక ఎయిరిండియా సొంత బీమా సంగతి ఏమిటి? అనే ప్రశ్న సహజం. అంత పెద్ద సంస్థ కాబట్టి బీమా కూడా భారీగానే ఉంటుందని భావించాలి. తాజాగా బయటకు వస్తున్న కథనాల ప్రకారం.. ఎయిరిండియా రూ.4,080 కోట్ల బీమా క్లెయిమ్ పొందే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది భారత విమానయాన చరిత్రలోనే అతి పెద్దదిగా చెబుతున్నారు. ఈ అంచనాను వేసింది ప్రఖ్యాత సంస్థ బ్లూమ్ బర్గ్ కావడం గమనార్హం.ఎయిరిండియా బీమా కవరేజీ అందించిన వాటిలో జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కూడా ఒకటి. ఈ సంస్థ ఎండీ రామస్వామి నారాయణన్ కూడా ఎయిరిండియా క్లెయిన్ భారత దేశ చరిత్రలో అతిపెద్ద బీమా క్లెయిమ్ లలో ఒకటి అని పేర్కొనడం గమనార్హం. రూ.4 వేల కోట్లు (475 మిలియన్ డాలర్లు)లో 125 మిలియన్ డాలర్లు (రూ.1,075 కోట్లు) విమాన హల్-ఇంజిన్ కు, రూ.3,014 కోట్లు (350 మిలియన్ డాలర్లు) ప్రయాణికులు, ఇతరులకు ప్రాణ నష్టం జరిగినందుకు అదనపు క్లెయిమ్.వీటిలో



హల్ క్లెయిమ్ ను ముందుగా బీమా సంస్థలు పరిష్కరిస్తాయి. మిగతావాటికి కొంత సమయం పడుతుంది. ఇక ఈ పరిహారం మొత్తం రెండేళ్ల కిందట భారత విమానయాన పరిశ్రమ మొత్తం బీమా ప్రీమియం కంటే మూడు రెట్లు ఎక్కువ. ఇక అహ్మదాబాద్ ప్రమాదం తాలూకు ఆర్థిక భారం ప్రపంచ విమానయాన ఇన్సూరెన్స్, రీ ఇన్సూరెన్స్ మార్కెట్ ను బలంగా తాకడం ఖాయం. మున్ముందు భారత విమానయానం రంగంలో బీమా ప్రీమియంలు పెరుగుతాయని, లేదా పాలసీల రెన్యువల్ సమయంలో పెరుగుతాయని పేర్కొంటున్నారు.ఇక ఎయిరిండియా ప్రమాదంలో చనిపోయినవారిలో విదేశీయులు గణనీయంగా కూడా ఉండడం బీమా క్లెయిమ్ ల మొత్తాన్ని ప్రభావితం చేసింది. వీరి స్వదేశాలలోని చట్టాల ప్రకారం బీమా క్లెయిమ్ లెక్కిస్తారు.ఇక ఎయిరిండియా విమాన ప్రమాదం భారత బీమా పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం అంటున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల అణచివేత



అమలాపురం,అంబేద్కర్ కోనసీమ,ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ ధన్యవాదాలు తెలిపారు. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని ఎంపీ గంటి హరీష్ మాధుర్ గుర్తుచేశారు. ట్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరి స్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

# కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ రియాక్షన్..



హైదరాబాద్,తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే రాజా సింగ్ "సీనియర్ నాయకుడు" అని, తనను "సామాన్య కార్యకర్తను" అని పేర్కొనడమే కాకుండా, రాజా సింగ్ చెప్పినట్లు తాము పాటిస్తామని రాష్ట్ర కమలం పార్టీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతుంది.దీంతో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభేదాలను విడిచి పెట్టి, ఐక్యంగా లక్ష్య సాధన కోసం పని చేద్దామని కోరారు. మీరు ఎప్పుడు కలిస్తానని చెప్పిన అప్పుడు వచ్చి కలుస్తానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలనేది నా ఉద్దేశ్యం.. వ్యక్తిగత లబ్ధి, పదవుల కోసం తాను ఎప్పుడూ పని చేయలేదని రాజాసింగ్ వెల్లడించారు.అయితే, పార్టీని బలోపేతం చేయడం కోసం అంకితభావంతో పని చేశాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించడంపై దృష్టి పెట్టడానికి బదులుగా, పార్టీకి నిస్వార్థ సేవ చేసినప్పటికీ, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం?.. ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డాను.. ఈ రోజు కూడా నా కోసం కాకుండా, పార్టీ ఐక్యత కోసమే పని చేస్తున్నాను, లక్షలాది మంది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడుతున్నాను అని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను.. కొంచెం సమయం కేటాయించండి.. వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు. కిషన్ రెడ్డి ఎక్కడికి, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాను పార్టీని విభజించడానికి కాదు ఐక్యంగా ఉండటానికి ఇక్కడ ఉన్నాను అని రాజాసింగ్ చెప్పుకొచ్చారు.

# పోలీసులు అనుమతులు కవ్వింపు చర్యలేనా?

అమరావతి,జగన్మోహన్ రెడ్డి వంటి ప్రజాదరణ ఉన్న నేత పర్యటనకు వస్తున్నప్పుడు.. రాగల జనసందోహాన్ని అంచనా వేసి ఆమేరకు భద్రత ఏర్పాట్లు చేయడం అనేది పోలీసుల విధి. 'ఎన్నికార్లు వస్తాయి.. ఎంతమంది జనం వస్తారు' అని అనుమతి అడిగిన పార్టీ నేతల్ని ప్రశ్నిస్తే వారు అంచనాగా మాత్రమే చెప్పగలరు. పార్టీ అంచనాలను మించి జనం వచ్చినా తదనుగుణంగా సిద్ధంగా ఉండడం పోలీసు యంత్రాంగం బాధ్యత.కానీ.. ఏం జరిగినా సరే.. పార్టీ మీదకు నెట్టేయాలనే ముందస్తు ప్రణాళికతో.. వారిని ఇరుకున పెట్టడానికి బోలెడు ప్రశ్నలు సంధించడం అనేది అనుమానాస్పదం అనేది ప్రజల భావన. కానీ.. సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల గ్రామంలో జగన్ పర్యటనకు సంబంధించి పోలీసులు ఇచ్చిన అనుమతులు మాత్రం.. ఖచ్చితంగా జగన్ వర్గీయులను, పార్టీ వారిని రెచ్చగొట్టడమే లక్ష్యంగా ఉన్నాయని ప్రజలు భావిస్తు న్నారు.రెంటపాళ్ల గ్రామంలో నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించడానికి జగన్ బుధవారం వెళ్లనున్నారు. దీనికి సంబంధించి వారం కిందటే పార్టీ నాయకులు పోలీసు అనుమతి కోరడం కూడా జరిగింది. అయితే పోలీసులు ఇచ్చిన అనుమతుల ప్రకారం వందమందికి మించి కార్యక్రమానికి హాజరు కావడానికి వీల్లేదు. జగన్ కాన్వాయ్ మినహా అదనంగా మరో నాలుగు కార్లు మాత్రమే రావొచ్చు! ఇలాంటి నిబంధనలు పార్టీ వారికి ఎలాంటి అభిప్రాయం కలిగిస్తాయి? ఖచ్చితంగా వారిని రెచ్చగొడతాయి.సాధారణంగా జగన్ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ ఉంటే.. మార్గమధ్యంలోని ఊర్లలో ఏ అధికారిక కార్యక్రమమూ లేకపోయినా కూడా.. ఆయన ప్రయాణించే రోడ్డు మీదికి వేల సంఖ్యలో జనం పోగై.. ఆయనకు చేతులు ఊపి అభివాదాలు చేయడమూ.. అలాంటి చోట్ల జగన్ ఒకటిరెండు నిమిషాలు కారు ఆపించి వారితో ముచ్చటించడమూ చాలా తరచుగా జరుగుతుంటుంది. ఆయన ముఖ్యమంత్రి కాక మునుపు కూడా రైలు మార్గంలో ప్రయాణిస్తున్న సందర్భాల్లో..



ఆ రైలు ఆగే ప్రతిచోట స్టేషనులో వేల మంది వచ్చి కలిసే వారు.అలాంటిది జగన్ ముఖ్య మంత్రిగా ఒక టర్మ్ పనిచేసిన తర్వాత.. ఆయన ప్రజాదరణ కూడా పెరిగింది. మార్జిన్ లో ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన ఆదరణ తగ్గినట్టు కాదు. అందుకే ఇప్పటికీ ఆయన ఎక్కడ పర్యటించినా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతూనే ఉన్నారు.మొన్నటికి మొన్న పొదిలిలో పొగాకు రైతుల పరామర్శకు వెళ్లినప్పుడు గానీ, అదివరలో పాపిరెడ్డిపల్లికి వెళ్లినప్పుడు గానీ జనం ఎలా వచ్చారో అందరికీ తెలుసు. ఆ అనుభవాలను బట్టి అంచనాగా పోలీసు లు రెంటపాళ్ల పర్యటనకు ఏర్పాట్లు చేసుకోవాలి. అంతే తప్ప.. వందమందికి మించి రావడానికి వీల్లేదని ఆంక్షలు విధించడం జగన్ అభిమానుల్ని రెచ్చగొట్టడమే అని ప్రజలు భావిస్తున్నారు.ఈ తరహా కవ్వింపు చర్యలు పోలీసులకు తగవని, అసలే రెంట పాళ్లలో ఇరుకు వీధుల్లో కార్యక్రమం అని పోలీసులు ముందే గమనించినందున.. అక్కడ జనసందోహం విపరీతంగా ఉన్నా అవాంఛనీయ సంఘటనలేమీ జరగకుండా ఏర్పాట్లు మంచిదని ప్రజలు కోరుతు న్నారు.

# కేటీఆర్ శల్య సారధ్యం- బీఆర్ఎస్ విలవిల!



పార్టీని నడిపించడం అంటే రేవంత్ రెడ్డిని బూతులు తిట్టించడం, సోషల్ మీడియాలో ఎమ్మెల్యేల క్యారెక్టర్లపై తప్పుడు ప్రచారాలు చేయించడం, యూట్యూబ్ చానళ్లలో థంబ్ నైల్స్ పెట్టించుకుని సంతృప్తి పడటం కాదు. కానీ బీఆర్ఎస్ ను ఇప్పుడు నడిపిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పుడు పూర్తిగా అవే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ వ్యవహారాల సంగతేమో కానీ.. సామాన్య ప్రజల్లో ఇదేమి రాజకీయం అనే అసహ్య భావన పెరిగేలా రాజకీయం చేస్తున్నారు. ఆయన తీరు చూసి.. సీనియర్ నేతలు కూడా.. ఇలాగయితే ఎలా అని మథనపడుతున్నారు.

కేటీఆర్‌పై ప్రజల్లో బ్యాడ్ ఇమేజ్

తిట్లు అనేవి ఎవరైనా మాట్లాడవచ్చు. అదేమి బ్రహ్మ విద్య కాదు. అందరికీ నోరు ఉంటుంది. కానీ .. ఆ తిట్లు, మాటలు క్యారెక్టర్ పై ముద్ర వేస్తాయి. కేటీఆర్ అలాంటి ఆలోచనలు చేయలేకపోతున్నారు. కేటీఆర్ ను తిట్టడానికి రేవంత్ రెడ్డికి నోరు లేక కాదులేదా కాంగ్రెస్ నేతలకు లేక కాదు. తిరిగి తిడితే కేటీఆర్‌కు.. కాంగ్రెస్ నేతలకు తేడా ఏముందని జనం అనుకుంటారు. అందుకే కేటీఆర్ మాత్రమే దారి తప్పారని ప్రజలకు చూపించడానికి వారు అలాంటి మాటలు మాట్లాడటంలేదు. ఈ వ్యూహాన్ని అర్థం చేసుకోని కేటీఆర్.. రేవంత్ రెడ్డిని ఇష్టం వచ్చినట్లుగా తిడుతున్నారు.

ఆవేశం కాదు.. ఆలోచనతో చేసేదే రాజకీయం

కేటీఆర్ కు అహంకారం ఎక్కువని బీఆర్ఎస్ పార్టీ నేతలు చెప్పుకుంటూ ఉంటారు. ఆయన వ్యవహారశైలి అలాగే ఉంటుంది. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన అగ్రనేతలెవరూ కేసీఆర్ పై ఆగ్రహంగా ఉండరు.. వివేక్, పొంగులేటి, విశ్వేశ్వర్ రెడ్డి , ఈటల సహా చాలా మంది కేటీఆర్ తీరు వల్లనే బయటకుపోయారు. స్వల్ప తేడాతో ఓడిపోయిన బీఆర్ఎస్.. అలాంటి నేతల్ని కాపాడుకుని ఉంటే మూడోసారి అధికారంలోకి వచ్చి ఉండేదని సులువుగా అర్థం చేసుకోవచ్చు. కానీ కేటీఆర్ తన వైపు తప్పుల్ని దిద్దుకోవడానికి సిద్ధంగా లేరు. ఇంకా ఇంకా అహంకారపూరితంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. గతంలో తమ పార్టీ నేతలపై చూపించేవారు. కానీ ఇప్పుడు నేరుగా ప్రజలపై చూపిస్తున్నారు.

ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారా ?

ఎన్నికలు వస్తే ఇక ప్రమాణ స్వీకారం చేయడమే అని కేటీఆర్ అనుకుంటున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిపోయిందని ఫీలవుతున్నారు. ఆయన అదో రకమైన ఊహా ప్రపంచంలో బతికేస్తున్నారు. బయటకు అలా కనిపిస్తున్నారా లేకపోతే నిజంగా అదే భావనలో ఉన్నారా అన్నది బీఆర్ఎస్ నేతలకే తెలియాలి. అలా కనిపించేందుకు ప్రయత్నిస్తే.. ప్రజల్ని ఆకట్టుకునే రాజకీయాలు చేయాలి. అలాంటివి చేయడం లేదు. పార్టీ క్యాడర్ కు దిశానిర్దేశం చేయడం లేదు. ప్రతిపక్షంగా తాము ప్రజా సమస్యలపై పోరాడుతున్నామా.. ప్రజల్ని తమ పోరాటాలు ఆకట్టుకుంటున్నాయా అన్నది పరిశీలన చేసుకోవడం లేదు. ఎందుకంటే.. ఇప్పటి వరకూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన పోరాటం ఏమి లేదు.పార్టీని నడపడం చేతకావడం లేదని కేటీఆర్‌పై కవిత మండిపడుతున్నారు. ఆమె ఆవేదనలో అర్థం ఉంది. ఆ విషయంపై క్యాడర్‌కూ అవగాహన ఉంది.

# పశ్చిమాసియా యుద్ధ వాతావరణం..చమురు ధరలపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ,పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చముఉ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. అందేకాకుండా డాలర్ మారకం కూడా పెరిగే ప్రమాదం ఉంది. అలాంటి సంకేతాలు కూడా అందుతు న్నాయి. ఇరాన్ కనుక పట్టుదలకు పోతే చమురు రవాణాకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉ న్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. సజావుగా ఉన్నప్పుడే దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉండేది. ఇప్పటికే ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగించుకుని వస్తూత్పత్తిని పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే ఇది మరింత పతనం కావచ్చు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇదే సూచిస్తున్నాయి. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జీఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. యూపీఏ పేమెంట్లపై సర్‌ఛార్జ్ విధిస్తారన్న వాదనలు బలంగా ముందుకు వచ్చాయి. కానీ తీవ్ర విమర్శలు రావడంతో..అలాంటిదేమీ లేదని సమాధానం వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం. ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలు బాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మౌనముని మోడీ మాత్రం




నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో విదేశాలకు వెళ్లే విద్యార్థులకు చదువులు భారంగా మారాయి. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com